వేతనాలు చెల్లించండి మహాప్రభో


పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న తాత్కాలిక సిబ్బంది

- ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో తాత్కాలిక ఉద్యోగుల జీతాలు
- నాలుగు నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

నస్పూర్: చేసిన పనికి వేతనాలు రాక, బయట అప్పులు పుట్టక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీనెల ఈసారైనా తమకు జీతాలు వస్తాయని ఎదురు చూడడం.. తీరా రాకపోవడంతో నిరుత్సాహపడడం వారికి పరిపాటిగా మారింది.

మొత్తం 216 మంది సిబ్బంది

మున్సిపాలిటీ పరిధిలో శాశ్వత ఉద్యోగులు కాకుండా తాత్కాలిక ఉద్యోగులు 86 మంది, ఔట్‌సోర్సింగ్ పరిధిలో 130 మంది కలిసి మొత్తంగా 216 మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతీ నెల మున్సిపల్ సాధారణ నిధుల నుండి జీతాలు చెల్లించాల్సి ఉంది. సాధారణ నిధుల నుండి జీతాలు చెల్లించడం సాధ్యం కావడం లేదని అధికారులు సిబ్బంది జీతాల చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారు.

ఇష్టారీతిన తాత్కాలిక ఉద్యోగుల నియామకం

పట్టణ ప్రగతిలో భాగంగా నర్సరీ, వాటర్ సప్లై, కామాటి, డ్రైవర్లు, వివిధ విభాగాల్లో విధులు నిర్వహించడానికి మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సమావేశం నిర్వహించి కౌన్సిల్ ఆమోదంతో సుమారు 86 మంది సిబ్బందిని తాత్కాలిక పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారు. వారిని నిబంధనల ప్రకారం నిర్ణీత కాలపరిమితి ముగిసిన తరువాత విధుల నుంచి తొలగించాలి. లేదా కౌన్సిల్ ఆమోదంతో కాల పరిమితిని పొడగించాలి. కానీ వారిని నియమించే సమయంలో పలువురు ప్రజా ప్రతినిధులు సదరు సిబ్బందికి మున్సిపాలిటీలో శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని లక్షల రూపాయలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక సిబ్బందికి జీతాలు చెల్లించలేక వారిని తొలగించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏదేమైనా తమ కష్టానికి ఫలితంగా రావాల్సిన జీతాలను త్వరగా ఇప్పించాలని సిబ్బంది వేడుకుంటున్నారు.

ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో..

మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు గత సంవత్సరం ఆగస్టు నుంచి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత సంవత్సరం డిసెంబర్ నుంచి వేతనాలు రావడం లేదు. దీంతో తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం అప్పుల పాలు అవుతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వాస్తవమే. వారికి పట్టణ ప్రగతి నిధుల నుంచి జీతాలు చెల్లించడానికి అన్ని అనుమతులు తీసుకున్నాం. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు విడుదల కాగానే వారి అకౌంట్లలో జమ అవుతాయి. – సీహెచ్ సతీష్, కమిషనర్

నంది పురస్కారానికి దీప్తి, చంద్రశేఖర్ ఎంపిక


అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్


అవార్డు అందుకుంటున్న దీప్తి

లక్సెట్టిపేట/మందమర్రిరూరల్: విద్యారంగంలో సేవలందించిన లక్సెట్టిపేటకు చెందిన కుష్నపల్లి దీప్తి, సామాజిక సేవారంగంలో మందమర్రికి చెందిన సింగరేణి ఉద్యోగి వేముల చంద్రశేఖర్ నంది పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏటా నంది అవార్డులు ప్రదానం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ దర్శకులు అల్లాణి శ్రీధర్, ప్రముఖ రచయిత భారవి, చిదానందకుమారి, కేవీ ప్రతాప్, ఉమామహేశ్వర్‌రావు చేతుల మీదుగా దీప్తి, చంద్రశేఖర్ నంది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

పెరిగిన వేతనాలపై ప్రచారం నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ రాథోడ్

భీమారం: ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం పెంచిన వేతనాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఎంపీడీవో రాధ రాథోడ్ కోరారు. ఉపాధి పనులపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న రూ.272 కూలిని ప్రభుత్వం రూ.300కు పెంచిందన్నారు. గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎంపీవో సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

జన్నారం: ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఒంటరిగా మిగిలిన ఓ వృద్ధురాలికి సామాజిక సంక్షేమ కమిటీ సభ్యులు అండగా నిలిచారు. మండలంలోని రోటిగూడకు చెందిన గోనె రామక్క కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వృద్ధురాలు తిండికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామానికి చెందిన సామాజిక సంక్షేమ కమిటీ సభ్యులు బుధవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంక్షేమ కమిటీ అడ్మిన్ పాలాజీ శ్రీనివాస్, సభ్యులు గాజుల సత్తయ్య, ఉప్పు శ్రీనివాస్, గట్టయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, నర్సింగ్, లవన్‌కుమార్, మల్లేష్, గోపాల్, చంద్రయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి తాళి, మెట్టెలు అందజేత


తాళి, మెట్టెలు అందిస్తున్న దంపతులు

తాండూర్: మండల కేంద్రానికి చెందిన అభినవ సంతోశ్‌కుమార్, సువర్ణ దంపతులు ఓ నిరుపేద యువతి వివాహానికి అండగా నిలిచారు. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఉప్పట్ల స్వప్న వివాహం ఈ నెల 4న జరగనుంది. కుటుంబ పేదరికం గురించి తెలిసిన ఆ దంపతులు బుధవారం మండలంలోని కన్యాకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో యువతికి తాళి, మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బాపూజీ, రమేశ్, సత్యనారాయణ, భాస్కర్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిది


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

జన్నారం: రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, జైభీం సైనిక్ దళ్‌జిల్లా అధ్యక్షుడు ఎర్రోల్ల నరేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాజ్యంగ రక్షణ యాత్రకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధిస్తే రాజ్యంగం మార్చే ప్రమాదం ఉందన్నారు. ఓటు ద్వారా బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బందెల బెంజిమెన్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ దేవేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, జన్నారం మండల అధ్యక్షుడు పాత బాలరాజు, హాజీపూర్ మండల అధ్యక్షుడు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: ఈ నెల 8 న హైదరాబాద్‌లో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర పోస్టర్లను బుధవారం స్థానిక ఐబీ ఆవరణలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు గరిసె రవీందర్, నాయకులు నరేష్, లింగయ్య, ప్రేంసాగర్, యేసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ వర్ధంతి


పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: ఛత్రపతి శివాజీ వర్ధంతిని బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చౌరస్తా వద్ద ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం శివాజీ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వినియోగానికి ముందే ఊడుతున్న తలుపులు


మరుగుదొడ్డికి ఊడిపోతున్న తలుపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 2019లో మరుగుదొడ్డి నిర్మించారు. సదరు మరుగుదొడ్డిని వినియోగించక ముందే తలుపులు ఊడి పోతున్నాయి. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో మేము సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా సదరు స్వచ్ఛంద సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బూబత్తుల శ్రీనివాస్, సభ్యులు రాజు, శ్రీధర్, చంద్రకాంత్, సోమయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పూర్తయినా అసంపూర్తిగానే పనులు


అసంపూర్తిగా మన ఊరు-మనబడి పనులు

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.90 లక్షల నిధులతో మన ఊరు–మన బడిలో పథకంలో భాగంగా అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు చేపట్టారు. పనులు ప్రారంభించి ఏడాది పూర్తయినా ఇంకా అసంపూర్తిగానే మిగిలి పోయాయి. కనీసం ఈ వేసవి సెలవుల్లోనైనా పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఏఈ రాజేశ్వర్‌ను సంప్రదించగా నిధులు లేక, బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపివేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న ప్రాణప్రతిష్ట మహోత్సవాలు


విగ్రహాల పూజలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ


దాతలను సన్మానిస్తున్న కమాండెంట్, సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న గోవింద క్షేత్రంలో నిర్వహిస్తున్న గోవిందరాజస్వామి సహిత భూవరాహస్వామి ప్రాణప్రతిష్టా మహోత్సవాలు కనుల పండవగా సాగుతున్నాయి. బుధవారం త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామి పర్యవేక్షణలో శ్రీనివాసాచార్య బృంద వేదపండితులు వేదమంత్రోచ్చరణల మధ్య విశేష అర్చనలతో పాటు ధాన్య, పుష్ప, ఫల, రత్న, ధనాధివాసములు, శయనాధివాసాల ప్రత్యేక పూజలతో పాటు అష్టబంధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సామూహిక లక్ష్మీ అష్టోత్తర విష్ణు సహస్రనామ పారాయణం చేసి తీర్థగోష్టి నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జమీల్‌భాషా, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మూలవిరాట్టులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మూలవిరాట్టు విగ్రహ దాతలు బిల్లా రాజ్యలక్ష్మి, మల్లయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ నెల 4న గురువారం ఉదయం గోవిందరాజస్వామి, భూవరాహస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్టతో పాటు శాంతికళ్యాణం ఉంటుందని, ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ కోరింది.

నిరుపయోగంగా నీటి తొట్టీలు

- దాహార్తితో అల్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు


సండ్రోన్‌పల్లి సమీపంలోని నీటి తొట్టి


సారంగపల్లిలో కబ్జాకు గురైన నీటి తొట్టి

మందమర్రిరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వేలాది రూపాయల నిధులు వెచ్చించి మందమర్రి మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో నిర్మించిన నీటి తొట్టీలు నిరుపయోగంగా మారాయి. సంబంధిత సిబ్బంది తొట్టీల్లో నీళ్ల నింపక పోవడంతో మండుతున్న ఎండలకు పశువులు దాహార్తితో అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటితొట్టీల్లో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

సండ్రోన్‌పల్లిలో నిరుపయోగంగా నీటి తొట్టి

మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సండ్రోన్‌పల్లి రోడ్డు పక్కన ఏడెనిమిదేళ్ల క్రితం రూ.25 వేల నిధులతో ఉపాధి హామీ పనుల్లో భాగంగా నిర్మించిన నీటితొట్టిని పాత సారంగపల్లి గ్రామ పంచాయతీకి అప్పగించారు. కొత్తగా శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ ఏర్పాటు కావడంతో ప్రస్తుతం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో నీటి తొట్టి ఉంది. అందులో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగానే ఉంటోంది.

కబ్జాకు గురైన నీటితొట్టి

మండలంలోని సారంగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ భూమిలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నీటితొట్టిని నిర్మించారు. దానికి పక్కనే బోరు కూడా ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీ ప్రజలు ఆ నీటి తొట్టిని వినియోగించుకునేవారు. పశువులు కూడా దాహార్తి తీర్చుకునేవి. అందులో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఆస్థలంపై కన్నేసిన కొంతమంది నీటితొట్టిని కూల్చివేసి అక్రమంగా ఇంటినిర్మాణం చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శి వీరేందర్‌ను వివరణ కోరగా అక్కడ నీటి తొట్టి ఉన్న విషయంతో పాటు నిర్మాణం జరిగేది కూడా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు.

నీళ్లు నింపేలా చూస్తా



పశువుల దాహార్తి తీర్చేందుకు మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి నీటి తొట్టీలు నిర్మించి గ్రామ పంచాయతీలకు అప్పగించాం. గ్రామ పంచాయతీ సిబ్బంది ఆ వాటిలో నీళ్ల నింపే విధంగా చూస్తాం. సారంగపల్లిలో కబ్జాకు గురైన నీటితొట్టిపై ఆరా తీస్తాం.
– రజియా సుల్తానా, ఈజీఎస్ ఏపీవో, మందమర్రి మండలం

'నవోదయ'కు ఎంపిక


శ్రీరామ్

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌కు చెందిన కుషనపల్లి శ్రీరామ్ అనే విద్యార్థి జవహర్ నవోదయకు ఎంపికయ్యాడు. ఆరోతరగతిలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన పరీక్షలో శ్రీరామ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కుషనపల్లి మీనా లక్ష్మణ్ దంపతుల కుమారుడైన శ్రీరామ్ తాండూర్ విద్యాభారతి ఉన్నత పాఠశాలలో ఐదోతరగతి పూర్తి చేశాడు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్: బీజేపీ రామకృష్ణాపూర్ పట్టణ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ తెలిపారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులుగా కట్ట ఈశ్వరాచారి, మాసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వైద్య శ్రీనివాస్, ముద్దసాని శ్రీనివాస్, వీరమల్ల రాజయ్య, కార్యదర్శులుగా జీడి ప్రభాకర్, పాకాల ప్రభాకర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా కున్సోత్ సంతోష్‌రామ్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా బంగారి ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా శ్రీలత, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా వెంకన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న భాస్కర్ మహరాజ్

జైనూర్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని హరిభక్త పారాయణ్ భాస్కర్ మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని జామిని గ్రామంలో సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు దేశభక్తితో పాటు దైవభక్తిలో ముందుంటారన్నారు. గత 7 రోజులుగా అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో భాగంగా రాత్రింబవళ్ల హరినామ స్మరణ చేపట్టారని పేర్కొన్నారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలనే ఉద్దేశంతో సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పరామర్శ

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు నానమ్మ అండాలమ్మ ఇటీవల మృతిచెందగా, బుధవారం దశదిన కర్మ నిర్వహించారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేశ్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ ఎమ్మెల్యేను పరామర్శించారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న సలీమొద్దీన్

చెన్నూర్: చెన్నూర్ మండలం, పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు ముస్లిం మైనార్టీ యూత్ నాయకులు ఎస్‌కె సలీమొద్దీన్ తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు లేక ఆయా కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదసిర్, భూషన్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధికోసమే అసత్య ఆరోపణలు'

తాండూర్: రాజకీయ లబ్ధికోసమే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడ సుబ్బ దత్తుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులుగా తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. 2007లో తన పట్టా భూమిని ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వానికి అమ్మడం వాస్తవమేనన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాన్ని తన తప్పిదంగా విష ప్రచారం చేస్తూ నా దిష్టి బొమ్మను ఊరేగించడం ఎంతవరకు సమంజసమన్నారు. తాను లబ్ధిదారులకు పంపిణీ చేసిన భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని, అట్టి భూమిని నేను కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమేనన్నారు. ఆరోపణలు నిరూపించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

హద్దురాళ్ల తొలగింపు


హద్దురాళ్లను తొలగింపచేస్తున్న సిబ్బంది

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహడ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు హద్దురాళ్లను తొలగించారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీశ్ సిబ్బందితో వెళ్లి వెంచర్‌లోని హద్దురాళ్లను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు


ఆస్నాదలో టీకా వేస్తున్న సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం 1,190 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవితేజ, సమ్మయ్య, అజయ్, భాస్కర్, మహబూబ్ అలి, సాబీర్, హబీబ్ అలి, ధర్మాజి, సతీష్ పాల్గొన్నారు.

జెండా గద్దె కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఆర్కే 6 సుభాశ్‌నగర్‌లో గల జాతీయ జెండా గద్దెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు పీ రామయ్య, మామిడాల రవీందర్, ఎం.సదానందం, కనుకయ్య, లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై తాము మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో రాధరాథోడ్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.